క్లుప్తంగా

ప్రసన్న వేంకటేశ్వరుడికి భక్తుల పూజలు



స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

సుండుపల్లె : మండల పరిధిలోని ముడుంపాడు గ్రామ పంచాయతీ ఆరోగ్యపురంలో వెలసిన ప్రసన్న వేంకటేశ్వరస్వామికి ఆలయ అర్చకులు అమృనాయక్ సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే స్వామి వారికి ప్రత్యేక పూల అలంకరణ, అభిషేకం తదుపరి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

వీరభద్రుడికి పల్లకి సేవ



పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

రాయచోటి జగదాంబసెంటర్ : అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలో వెలసియున్న శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారి ఆలయంలో పల్లకి సేవ కార్యక్రమాన్ని సోమవారం వైభవంగా నిర్వహించినట్లు ఆలయ ఈఓ డివి రమణారెడ్డి తెలిపారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పలు రకాల పుష్పాలతో ఆలయ అర్చకులు అందంగా అలంకరించారు. అనంతరం పల్లకిలో ఉంచి మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. కార్యక్రమానికి పలువురు భక్తులు పాల్గొనగా వారికి తీర్థప్రసాదాలను అందజేశారు.

వినాయకుడికి అభిషేకాలు



సంకష్ట చతుర్థి అభిషేకాలకు హాజరైన భక్తులు

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి పట్టణంలో వెలసియున్న శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్ర స్వామి వారి దేవస్థానంలో పరివార దేవుళ్లైన శ్రీ వినాయక స్వామి వారికి సోమవారం సంకష్ట చతుర్థి అభిషేకాలను భక్తులు చేయించినట్లు ఆలయ ఈఓ డివి రమణారెడ్డి తెలిపారు. వచ్చిన భక్తులకు ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందజేశారన్నారు. ఈ పూజలకు పలువురు భక్తులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

సుండుపల్లె : మండల పరిధిలోని చిన్నగొల్లపల్లి గ్రామ పంచాయతీ కుంగూట వడ్డేపల్లెకు చెందిన ఆరుగురిపై దాడి ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు పాత భూములు, బోరు నీరుపై ఇరువురు దాడి చేసుకున్నట్లు తెలిపారు. దాడికి పాల్పడిన ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నివాళి



సిద్దేశ్వరరాజు (ఫైల్)

ఓబులవారిపల్లె : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎల్.సిద్దేశ్వరరాజు (59) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. బొమ్మవారం గ్రామానికి చెందిన సిద్దేశ్వరరాజు పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటూ అందరితో సన్నిహితంగా మెలిగేవారు. ఆయన మృతదేహాన్ని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వత్తలూరు సాయికిషోర్ రెడ్డి, చిట్వేలి మండల అధ్యక్షులు చెవ్వ శ్రీనివాసులు రెడ్డి, రాయలసీమ జోనల్ బూత్ కమిటీ అధ్యక్షులు తల్లం భరత్‌కుమార్ రెడ్డి, సీనియర్ నాయకులు సీడీ నాగేంద్ర, వైస్ ఎంపీపీ గూడూరు గౌరీశంకర్ రాజు తదితర పార్టీ నాయకులు మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. మంగళవారం బొమ్మవరం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు మృతుని సోదరుడు బొమ్మవరం సర్పంచ్ ఎల్.గంగురాజు తెలిపారు.

మూర్ఛ రోగులకు ఉచిత వైద్య శిబిరం

మదనపల్లె సిటీ : మూర్ఛ రోగులకు ఈనెల 20వతేదీన స్థానిక అమ్మచెరువుమిట్ట వద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వెలుగు కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి తెలిపారు. విజయవాడకు చెందిన జీబీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ గోపాలం శివన్నారాయణ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అందుబాటులో ఉంటారన్నారు. మూర్ఛవ్యాధితో బాధపడే వారు వైద్య శిబిరంకు హాజరై ఉచితంగా పరీక్షలు, మందులు తీసుకోవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు 7799996609, 9440556284ను సంప్రదించాలని కోరారు.

తిప్పకుంటున్నారు.. తిప్పలు పెడుతున్నారు

- ధృవీకరణ పత్రాల జారీలో రెవెన్యూ అధికారుల అలసత్వంపై ప్రజల అసహనం
- ఓబీసీ సర్టిఫికెట్ ఇచ్చే విషయంలో నిర్లక్ష్య వైఖరి
- అనవసర పత్రాలు జతపరచాలంటూ ఒత్తిడి
- సిబ్బంది తీరు తాళలేక అర్జీదారుల ఆవేదన



సిద్దవటంలోని మండల రెవెన్యూ కార్యాలయం

సిద్దవటం : విద్యార్థులు కేంద్ర విద్యాలయాల్లో చేరుటకు, నిరుద్యోగులు కేంద్రం సంస్థలలో ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకునేందుకు ఓబీసీ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు చేసుకుంటే అటు విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో సిద్దవటం రెవెన్యూ అధికారులు చెలగాటం ఆడుతున్నారు. ఓబీసీ సర్టిఫికెట్ల గడువు కాలం 30 రోజులు చూపిస్తుండటంతో విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నారు. వీఆర్‌ఓలు, ఆర్‌ఐలు, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటూ కాలయాపన చేస్తూ దరఖాస్తుదారుల సమయాన్ని వృథా చేస్తున్నారు. ప్రశ్నించిన వారిని అడ్డగోలు సమాధానం ఇస్తూ సరైన ధృవపత్రాలను మంజూరు చేయలేదని అవహేళనగా మాట్లాడుతున్నారని పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అంతేగాకుండా కుల, ఆదాయం, సర్టిఫికెట్ల మంజూరుకు సచివాలయాలకు వెళితే ఆయా కుటుంబాలకు సంబంధించి ఎవరిదైనా పాత సర్టిఫికెట్లును దరఖాస్తుకు జతపరిస్తేనే లేదంటే దరఖాస్తులను తీసుకోవడం లేదని కొందరు విద్యార్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు విద్యార్థులు, నిరుద్యోగులకు కుల, ఆదాయం, ఓబీసీ సర్టిఫికెట్లను త్వరితగతిన మంజూరు చేయాలని కోరుకుంటున్నారు.

ఓబీసీ సర్టిఫికెట్‌కు నోటరీ తప్పనిసరా?

ఓబీసీ సర్టిఫికెట్ మంజూరు చేసేందుకు అర్జీదారుడు నోటరీకి రూ.300 చెల్లించి అదనపు ఖర్చులతో లాయర్ నోటరీ ఓబీసీ సర్టిఫికెట్ కోసం తప్పనిసరినా.. లాయర్ నోటరీ ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉన్నారు. అంతేగాకుండా సర్టిఫికెట్‌కు విద్యార్థుల తల్లిదండ్రుల ఆస్తుల వివరాలను సమకూర్చాలంటూ ఒత్తిడి చేయడం అధికారులకు సమంజసమేనా అంటూ దరఖాస్తుదారులు, తల్లిదండ్రులు, నిరుద్యోగులు వాపోతున్నారు. గతంలో లేని ఇటువంటి నిబంధనలు ప్రస్తుతం ఎందుకు ఏర్పడ్డాయో తెలియదంటూ అర్జీదారులు వాపోతున్నారు.

ప్రశ్నిస్తే కక్షసాధింపులు



ప్రస్తుతం చిన్న సర్టిఫికెట్ కోసం వారాల తరబడి రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది. నేను ఓబీసీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకొని సంబంధిత అధికారులను సంప్రదిస్తే సంబంధం లేని ధృవపత్రాలను తీసుకురావాలని చెబుతున్నారు. అవి ఎందుకు అని ప్రశ్నిస్తే అధికారులు పొంతనలేని సమాధానం చెబుతూ సర్టిఫికెట్ జారీలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పని చేయడం లేదు.

– బూరేపల్లి వెంకటసుబ్బయ్య, భాకరాపేట, సిద్దవటం మండలం

దరఖాస్తును తహసీల్దారు రిజెక్టు చేశారు



రైల్వే టెక్నీషియన్–1 పోస్టుకు దరఖాస్తు చేసుకునేందుకు ఓబీసీ సర్టిఫికెట్ కోసం గత నెల 30వ తేదీన దరఖాస్తు చేసుకున్నాను. దరఖాస్తు నెంబర్ ఓబీసీ 250630074123, నా దరఖాస్తును వీఆర్‌ఓ, ఆర్‌ఐ అప్రూవ్ చేశారు. అయితే ఈనెల 5వ తేదీన తన దరఖాస్తును తహసీల్దారు రిజెక్టు చేశారు. కారణం ఏమిటి అని అడిగితే తాను గ్రామంలో అందుబాటులో లేనని చేశామంటున్నారు. ఇలా సమాధానం చెప్పటం సిద్దవటం తహసీల్దారుకు ఇది తగునా.

– షేక్ అల్తాఫ్, భాకరాపేట, సిద్దవటం మండలం

వాహనదారులకు లైసెన్స్ తప్పనిసరి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మహమ్మద్ రఫీ

సిద్దవటం : ప్రతి వాహనదారుడికి లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ క్రాస్ రోడ్డులో సోమవారం సాయంత్రం ఆయన స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రోడ్డు ప్రమాదాల పట్ల వాహనదారులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని లేకుంటే చట్టం ప్రకారం రూ.1000, లైసెన్స్ లేనివారికి రూ.5000 జరిమానా విధించబడుతుందని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాటిని సీజ్ చేస్తామని ఆయన తెలియజేశార. కార్యక్రమంలో ఏఎస్ఐ బాబయ్య, రైటర్ రాముడు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

జెడ్పీ ఛైర్‌పర్సన్‌పై దాడి హేయం



ఏకుల రాజేశ్వరిరెడ్డి

సిద్దవటం : కృష్ణా జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ గూండాలు దాడి చేయడం హేయమైన చర్య అని వైఎస్ఆర్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి మండిపడ్డారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. మహిళా ప్రజాప్రతినిధులపై బరితెగించి దాడులు చేయడం అన్యాయమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడమే కాకుండా పలువురిని పొట్టన పెట్టుకున్నారన్నారు. మహిళలు అని కూడా చూడకుండా దాడులు పాల్పడటం టీడీపీ నీచ సంస్కృతిని నిదర్శమన్నారు. రాష్ట్రంలో హోం మినిస్టర్‌గా ఒక మహిళ ఉన్నా మహిళలపై దాడులు జరుగుతున్నాయంటే రాష్ట్రంలో ఆటవిక పాలన ఏ విధంగా కొనసాగుతోందో అర్థం చేసుకోవచ్చని చెప్పారు. చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో వైఎస్ఆర్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులను టార్గెట్ చేస్తున్నారని ఆమె ధ్వజమెత్తారు.

ముదురు మామిడి తోటల్లో.. పునరుద్ధరణ చర్యలతో మంచి దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఓ సింధూరి

లక్కిరెడ్డిపల్లి : ముదురు మామిడి తోటల్లో కాయ కోత అనంతరం పునరుద్ధరణ చర్యలు, మామిడి రైతుకు మంచి దిగుబడులు వస్తాయని లక్కిరెడ్డిపల్లి ఉద్యానశాఖ అధికారిణి(హెచ్‌ఓ) ఎస్.సిందూరి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మద్దిరేవుల పంచాయతీ రెడ్డివారిపల్లి గ్రామంలో కోత అనంతరం చేపట్టాల్సిన చర్యలను ఆమె వివరించారు. ముదురు తోటల్లో కొమ్మలు బాగా పెరిగిపోవడం వల్ల సూర్యరష్మి సోకక చీడపీడల బెడద పెరిగి సస్యరక్షణ చర్యలు కష్టం కావడంతో పాటు దిగుబడులు నాణ్యత తగ్గుతాయన్నారు. కాయలు కోసిన తరువాత 15 నుంచి 20 రోజులు చెట్టుకు విశ్రాంతి ఇవ్వాలన్నారు. అనంతరం ఎండిన పూత కాడల ద్వారా ఎండు తెగులు వ్యాపించే అవకాశం ఉందని, కావున వీటిని వర్షాకాలం రాకముందే తొలగించాలన్నారు. బంగినపల్లి, నీలం రకాలలో ప్రతి ఏటా కొమ్మలను కత్తిరించి చెట్లపై నలువైపులా కాంతి, గాలి సోకేలా చేయడం అవసరమన్నారు. కత్తిరింపులు చేసిన వెంటనే పెద్దకొమ్మల భాగానికి 10 గ్రాముల కాపరాక్సి క్లోరైడ్, ఆరు గ్రాములు కార్బరిల్ లీటర్ నీటికి కలిపి ద్రావణం పూయాలన్నారు. చెట్టు పూర్తిగా తడిచేలా మూడు గ్రాముల కాపరాక్సి క్లోరైడ్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. జూలై, ఆగస్టు నెలల్లో తొలకరి వర్షాలు పడగానే వాలుకు అడ్డంగా దున్నాలన్నారు. నీటి వసతి కల్గిన తోటల్లో ఒక చెట్టుకు ఒక కిలో యూరియా, ఐదు కిలోల సూపర్ పాస్ఫేట్, 750 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలన్నారు. వర్షాధార తోటల్లో అయితే ఆగస్టు నెలలోనే రెండు కిలోల యూరియా, ఐదు కిలోల సూపర్, ఒకటి పాయింట్ ఐదు కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలన్నారు. ఎరువులను చెట్టు మొదలుకు నాలుగు నుంచి ఐదు అడుగుల దూరంలో చేసిన గాడిలో వేసి మట్టిలో నీరు కలిపి పారించాలన్నారు. జూలై, ఆగస్టులో పచ్చిరొట్ట పైర్లు అయిన జనుము, జీలుగ, నల్ల పెసర, అలసంద, ఉలవలు లాంటి పంటలు వేసి పూత దశలో కలియదున్నాలన్నారు. జింక్, బోరాన్ ధాతువుల లోపాలు సాధారణంగా మామిడిలో కనిపిస్తాయని, ఈ సూక్ష్మధాతువుల లోపాలను నివారించడానికి ఐదు గ్రాముల జింక్ సల్ఫేట్, రెండు గ్రాముల బోరాన్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని లేదా ఫార్ములా 4 పొడిని లీటరు నీటికి ఐదు గ్రాముల చొప్పున కలిపి 20 రోజులు వ్యవధిలో రెండు, మూడు సార్లు పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి విహెచ్‌ఎ లావణ్య, గ్రామ రైతులు శ్రీనివాసులు, హరినాథ రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని ఎరువులు అమ్మితే చర్యలు



స్టాకును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

రాయచోటి జగదాంబసెంటర్ : అనుమతులు లేని ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని కల్యాణదుర్గం ఏడీఏ ఎల్లప్ప, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ చంద్రశేఖర్‌లు హెచ్చరించారు. సోమవారం వారు రాయచోటి మండల పరిధిలోని ఎరువులు, పురుగు మందులు, విత్తన షాపులను తనిఖీ చేశారు. అన్ని షాపులలో రిజిస్టర్లు, స్టాకును పరిశీలించారు. విధిగా డీలర్లు అమ్మకపు రశీదులను తప్పనిసరిగా రైతులకు ఇవ్వాలన్నారు. ఎక్కడా ఖరీఫ్ 2025 సీజన్‌కు ఎరువుల కొరత రాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్యాలయ అధికారి పవన్‌కుమార్, మండల వ్యవసాయాధికారి రాజేంద్రప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ సెల్‌పై దృష్టి పెట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ అమరేశ్వరి

పెనగలూరు : గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తహసీల్దార్ అమరేశ్వరి అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని వీఆర్‌ఓలతో తహసీల్దార్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో మండలంలో జిల్లాలో వచ్చినటువంటి అర్జీలపై ప్రత్యేక దృష్టిపెట్టి పరిష్కరించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వ స్థలాల్లో గృహాలు నిర్మించుకొని ఉంటే వాటిని వారికి అప్పగించడం జరుగుతుందని చెప్పారు. అలాంటివి ఎవరివైనా ఉంటే వారికి అవగాహన కల్పించి గృహాలు ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ద్వారా చేయించుకోవాలని ఆమె తెలిపారు. అలాగే అన్నదాత సుఖీభవ పథకంలో తప్పులు ఉంటే వెంటనే తహసీల్దార్ కార్యాలయాలను సంప్రదించాలన్నారు. పొలాలకు ఇతర ఆధార్ కార్డులు నమోదై ఉన్న వారి ఆధార్ కార్డులు నమోదు కాకుండా ఉంటే అలాంటి వారివి వెంటనే నమోదు చేసి అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులుగా చేయవలసిన బాధ్యత రెవెన్యూ సిబ్బందిపై ఉందన్నారు. పలు అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న నరసింహులు

సుండుపల్లె : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం మండల శాఖ ఎన్నికలను మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ ఎలిమెంటరీ పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరసింహులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల ప్రభుత్వం జరిపిన ఉపాధ్యాయ బదిలీలలో అనేకమంది ఉపాధ్యాయులకు ఐడీలు సరిగా లేక జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యలు పరిష్కరించి జీతాలు పడే విధంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తామన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రవీంద్రనాయుడు, ప్రధాన కార్యదర్శిగా నారాయణ నాయక్, కోశాధికారిగా చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా రామమోహన్, కార్యదర్శిగా మధుసూదన్‌రావు, మహిళా కన్వీనర్‌గా మునీశ్వరమ్మ, క్రీడా కన్వీనర్‌గా రాధారాణిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రవీంద్రనాయుడు మాట్లాడుతూ మండలంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని తెలియజేశారు.

పశుపతినాథా.. చల్లంగా చూడయ్యా



అన్నమయ్య సంకీర్తనలు ఆలపిస్తున్న సంగీత బృందం



అలంకరణలో పశుపతినాథుడు

సంబేపల్లె : పశుపతినాథా.. చల్లంగా చూడవయ్యా అంటూ భక్తులు ప్రత్యేక పూజల నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీ పశుపతినాథుని ఆలయంలో సోమవారం లింగస్వరూపున్ని ప్రత్యేకంగా అలంకరించారు.

స్వామి వారికి భక్తులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టుకు ఆధ్వర్యంలో హరిదాసు కుటుంబీకు, గాత్రం ఆనంద్‌రెడ్డి వారి బృందం నిర్వహించిన అన్నమయ్య సంకీర్తనలు భక్తులను అలరించాయి. అనంతరం వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

కడప సెవెన్ రోడ్స్ : శ్రావణ మాసం రానున్న నేపథ్యంలో కడప సమీపంలోని పాలకొండలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని తాళపత్ర గ్రంథ లిపి నిపుణులు మునికుమార్ అధికారులను కోరారు. పాల కొండ ఆలయ ప్రాంగణం వద్ద దేవస్థాన స్థలం అటవీశాఖ స్థలాలను స్పష్టంగా చూపిస్తూ సర్వే నిర్వహించాలని కోరారు. వెయ్యి సంవత్సరాల చరిత్ర కలిగిన ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన పాలకొండరాయ స్వామి ఆలయ బాగోగులు అధికారులు పట్టించుకోవాలన్నారు. పాలకొండకు ఏకో టూరిజం బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు.

బుద్ధ విగ్రహం ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలి

మదనపల్లె రూరల్ : మండలంలోని అంకిశెట్టిపల్లె పంచాయతీ బుద్ధునికొండలో బుద్ధ విగ్రహాలపై పలుమార్లు దాడులకు పాల్పడిన దుండగులను వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని బహుజనసేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరుగుతున్న ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌ని కలిసి, బుద్ధ విగ్రహం ధ్వంసం ఘటనలో పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై ఫిర్యాదుచేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఐదురోజుల క్రితం బుద్ధునికొండలో బుద్ధ విగ్రహంను ధ్వంసం చేసి, తలను తొలగించిన దుండగులను గుర్తించి శిక్షించడంలో తాలూకా సీఐ కళావెంకటరమణ విఫలమై, నిరసన వ్యక్తం చేస్తున్న వారిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. పోలీసులు విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను పట్టుకోవడంలో విఫలమయ్యారని, జిల్లా ఎస్పీ సొంత రాజ్యాంగాన్ని అమలుపరుస్తూ, నానా హైరానా పట్టిస్తున్నారన్నారు. ఎస్పీ దుశ్చర్యలపై కర్నూలు రేంజ్ డీఐజీకి ఫిర్యాదుచేశామన్నారు. మదనపల్లె పోలీసుల ఆగడాలు ఇలాగే కొనసాగితే.. ఈనెల 28న ఛలో మదనపల్లె కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తామన్నారు. అన్ని వర్గాల ప్రజలను, దక్షిణాది రాష్ట్రాల నాయకులను ఆహ్వానించి పోలీసుల తీరును ఎండగడతామని హెచ్చరించారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, సీఐ కళావెంకటరమణలపై డీజీపీకి ఫిర్యాదుచేస్తామన్నారు. తక్షణమే పోలీసు యంత్రాంగం ఈకేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని దుండగులను పట్టుకుని శిక్షించి, భవిష్యత్తులో విగ్రహాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటుకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో బహుజనసేన నాయకులు గిన్నెల మనోహర్‌రెడ్డి, బాస్ నాయకులు ముత్యాలమోహన్, బురుజు రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మంచి ర్యాంకు పొందేందుకు కష్టపడాలి



మెటీరియల్ అందుకున్న విద్యార్థినులతో అధ్యాపకులు

నందలూరు : స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మంచి ర్యాంకు పొందేందుకు కష్టపడాలని అధ్యాపకులు సూచించారు. సోమవారం మండలంలోని నాగిరెడ్డిపల్లె బాలికల జూనియర్ కళాశాల (హైస్కూల్ ప్లస్)లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదివే విద్యార్థినులకు సోమవారం సాయంత్రం ప్రధాన ఆచార్యులు (ఎఫ్ఏసీ) గంగనపల్లి వెంకటరమణ ఆధ్వర్యంలో ఈఏపీసెట్‌తోపాటు నీట్ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగిశెట్టి లక్ష్మీనారాయణ, బోగా వెంకటసుబ్బయ్య, విజయకుమారి, వల్లూరు మస్తాన్, ఉపాధ్యాయులు కిరణ్, శిల్పి ఆనందచారి, జీవీ ప్రసాదరావు, గొంటుముక్కల వెంకటరమణ, గీత, జ్యోతిప్రియా, గౌరీ, గాయత్రీదేవి, డాక్టర్ శర్వాణీ తదితరులు పాల్గొన్నారు.

కడప – బెంగళూరు రైల్వే లైన్ పూర్తి చేయాలి

రాయచోటి జగదాంబసెంటర్ : కడప – రాయచోటి – మదనపల్లె – బెంగళూరు నూతన బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి బహిరంగ లేఖ రాశారు. సోమవారం రాయచోటి పట్టణంలో ఆయన మాట్లాడుతూ బహిరంగ లేఖను సీఎంకు మెయిల్ ద్వారా పంపినట్లు తెలిపారు. రాయలసీమ ప్రాంత రైతులు, వినియోగదారులు, ప్రజల సమగ్రాభివృద్ధి కోసం 2008 – 09 రైల్వే బడ్జెట్‌లో రైలు మార్గం మంజూరైందని తెలిపారు. రైలు మార్గం పొడవు 255.40 కిలోమీటర్లు కాగా 50 శాతం కేంద్రం, 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం నిధులు భరించే షరతులతో మంజూరైందని చెప్పారు. అనంతరం జరిగిన పలు పరిణామాల వల్ల రైల్వే లైన్ పనులు ఆగిపోయాయని అన్నారు. రాయలసీమ ప్రాంతంలోని ప్రజాప్రతినిధులు ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం రైల్వే లైన్ పనులు పూర్తి చేయడానికి నిధులు మంజూరునకు కృషి చేయాలని ఆయన కోరారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వీలేరు : స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రవేశానికి రెండోవిడత దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బాలమురళీప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీలోపు విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 22వ తేదీలోపు తమ ఒరిజనల్ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. 23వ తేదీ ఉదయం 10 గంటలకు ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తో కళాశాలకు హాజరు కావాలని కోరారు. పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులు కూడా వెల్డర్ కోర్సులకు అర్హులని తెలిపారు. అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఊరిస్తున్న మబ్బులు.. కరుణించని వరుణుడు

- ఆందోళనలో రైతాంగం
- కరువుఛాయలతో బెంబేలెత్తుతున్న వైనం



ఊరిస్తున్న మబ్బులు

పెనగలూరు : మండలంలో గత రెండు నెలల నుంచి మబ్బులు ఊరిస్తున్న వరుణుడు కరుణించడంలేదు. వేసవి కాలంలో కురవని వర్షాలు రుతుపవనాలతోనైనా మండలంలో వర్షాలు పడతాయని రైతులు ఆశించారు. జూన్, జూలై మాసాలలో ఒక పదును కూడా మండలంలో వర్షం పడకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. జూన్ నెలలో 6.5 మిల్లీ మీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. జూలై నెలలో ఒక పదను కూడా వర్షం పడలేదు. దీంతో మామిడి చెట్లు, నిమ్మచెట్లు అక్కడక్కడ ఎండిపోతున్నాయి. బోర్లలో నీరు అడుగంటి పోవడంతో రైతన్నలు ఇబ్బందులు పడుతున్నారు. బోర్లల్లో నీరు అడుగంటిపోవడంతో అక్కడక్కడ బోర్ల కింద వరి నాటిన వారు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇక కొండ ప్రాంతాలలో బోర్లలో నీరు రావడం లేదు. గతంలో నీరు రాకపోతే మామిడి తోటలలో ఆదాయాలు వచ్చి ఉండటంతో తిరిగి బోర్లు వేసేవారు. ఈ ఏడాది తోటలో రూపాయి కూడా రైతులకు ఆదాయం రాకపోవడంతో నీరు రాకపోతే బోరు వేద్దాం అన్న ఆలోచన రైతుల్లో కలగకపోవడం గమనార్హం. చినుకు జాడలేక దిక్కుతోచని పరిస్థితుల్లో మండల రైతాంగం ఆందోళన చెందుతోంది. పొరపాటుగా వరి నాటిన వారు బోర్లలో నీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏది ఏమైనప్పటికీ ఆకాశంలో ఉన్న మబ్బులు చూసి రైతులు వర్షం పడుతుందని ఆశగా ఎదురు చూస్తున్నా ఫలితం లేదు.

సజ్జపంట వాడిపోతోంది



గత రెండు నెలల నుంచి పదును కూడా వర్షం పడకపోవడంతో వర్షాన్ని నమ్ముకుని సాగు చేసిన సజ్జ పంట వాడిపోతోంది. సజ్జపంట సాగు చేయడంతో మంచి ఫలితాలు వస్తాయని ఎదురు చూస్తున్నా కానీ పెట్టుబడి సైతం వచ్చే పరిస్థితి కనిపించడంలేదు. ఈ ఏడాది కూడా కరువు వచ్చే పరిస్థితులు దర్శనమిస్తున్నాయి.

– నరసాపురం సుబ్బరాయుడు, రైతు, కొత్తపల్లి, పెనగలూరు మండలం

తోటలో గడ్డి కూడా వాడిపోతుంది



రెండు నెలలుగా వర్షాలు కురవకపోవడంతో మామిడి తోటలతోపాటు భూమిపై ఉన్న గడ్డి కూడా వాడిపోతోంది. దుక్కులు దున్నాలని ఎదురు చూస్తున్నా పదును కూడా వర్షం పడడం లేదు. ఇక డ్రిప్‌లు వేద్దామనుకుంటే వర్షం పడుతుందనే ఆశతో ఎదురు చూస్తున్నాం. ముందస్తు వర్షాలు మండలంలో చినుకు కూడా పడకపోవడంతో రైతులు అందరూ ఇబ్బందులు పడుతున్నాం.

– చలపాటి బాల, రైతు, కొత్తపల్లి, పెనగలూరు మండలం